నేడు ఎన్‌జీఓస్ కాలనీలో..

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

వనస్థలిపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం వనస్థలిపురం ఎన్‌జీఓస్ కాలనీలోని ఛత్రపతి శివాజీ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగనున్నాయి. ఆసక్తిగల మహిళలు ఈ పోటీలలో పాల్గొనవచ్చును. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 6 వేలు, ద్వితీయ బహుమతి రూ. 4 వేలు, తృతీయ బహుమతి రూ. 3 వేలు నగదు బహుమతి ప్రదానం చేస్తారు. ఈ పోటీలలో చుక్కల ముగ్గులు మాత్రమే వేయాల్సి ఉంటుంది. పోటీలలో పాల్గొనే వారు ముగ్గులు, రంగులు వారే తెచ్చుకోవాలి. పోటీలలో పాల్గొనాలనే ఆసక్తి గల వారు 9885672583/ 9985411064లో సంప్రదించాల్సి ఉంటుంది.



రిటర్నింగ్ వాల్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి

వరద ముంపు లేకుండా పనులు చేపట్టాలి

సైదాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నాలా రిటర్నింగ్ వాల్‌ను పటిష్ఠంగా నిర్మించి వరద ముంపు రాకుండా చర్యలు తీసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవిందర్‌రెడ్డి సూచించారు. శనివారం శంకేశ్వర్ బజార్‌లో కొనసాగుతున్న రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొత్తకాపు రవిందర్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన ఫ్లెక్సీలను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ఓల్డ్ మలక్‌పేట జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ముగియక ముందే ఓల్డ్ మలక్‌పేటలో ప్రభుత్వ ఫ్లెక్సీలను తొలగించడంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శానిటరి సిబ్బంది విఠల్‌రెడ్డి, రమేష్‌లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మలక్‌పేట సర్కిల్-6 డిప్యూటి కమిషనర్ జయంత్‌ను కలసి ఫిర్యాదు చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లో పోతదని స్థానికులతో చెప్తూ ప్రజాపాలన ఫ్లెక్సీలను చింపేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు ప్రభుత్వ ఉద్యోగులై ఉండి ఇలా చేయడం సరికాదని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో నాయకులు చౌకి రవికుమార్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, ఆకుల రాజు, మన్నన్ తదితరులున్నారు.

'కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి'

చాదర్‌ఘాట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అధిక ఫీజులు వసూలు చేస్తూ.. ఎలాంటి గుర్తింపు లేకుండా విద్యా సంస్థలను నడుపుతూ విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లో తెలంగాణ విద్యార్థి సమితి రాష్ట్ర అధ్యక్షుడు మంద రమేష్‌మాదిగ, బీసీ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డేపల్లి రాకేష్, తెలంగాణ బహుజన కార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మర్రి రాజేందర్, తెలంగాణ స్టూడెంట్స్ జేఏసీ అధ్యక్షుడు అమన్‌గల్ రాజు, తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు సప్ప సతీష్, బహుజన రాజ్యాధికార సాధన సమితి రాష్ట్ర నాయకులు ఫణీంద్రనాయక్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు చిప్పలపల్లి వెంకన్నతోపాటు పలువురు సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

శ్రీదుర్గాదేవి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ శ్రీసాయినగర్ కాలనీలోని శ్రీదుర్గాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, పురోహితులు బాలమురళి కృష్ణ, హనుమంతరావు, యాదగిరి, అశోక్, రమేష్, రవి, కృష్ణమూర్తి, కేశవులు, వినోద్, ప్రమోద్ పాల్గొన్నారు.

రైస్ ఏటీఎం వద్ద పేదలకు బియ్యం పంపిణీ

మన్సూరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ రాక్‌హిల్స్ కాలనీలో సామాజిక కార్యకర్త దోసపాటి రాము నిర్వహిస్తున్న రైస్ ఏటీఎం వద్ద పేదలకు శనివారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. పిల్లలు పట్టించుకోకపోవటంతో ఎంతో మంది వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, తమ రైస్ ఏటీఎం వద్దకు వచ్చి తమ బాధలు చెప్పుకుంటున్నారని రాము వివరించారు. వారికి వచ్చే పింఛను మందులకే సరిపోతున్నాయని, రేషన్ కార్డులు లేని వారు చాలా మందికి తమరైస్ ఏటీఎం ఆసరాగా మారిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ప్రిషా కన్వీనర్ యశస్వి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'చదువుకుంటేనే చక్కటి భవిష్యత్'

హయత్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని జీస్కూల్‌లో శనివారం జరిగిన కార్యక్రమానికి పద్మశ్రీ, అర్జున్ అవార్డు గ్రహీత ఎయిర్ ఇండియా కమర్షియల్ మేనేజర్ ఎన్. ముఖేష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మాట్లాడుతూ.. కష్టపడి చదువుకుంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతారని అన్నారు. తాను చిన్నప్పటి నుంచి చదువు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలను సమానంగా భావించి ముందుకు సాగానని గుర్తు చేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చక్కగా చదువుకుని మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని కోరారు. చదువుకోవడం వల్ల పేదరికం నుంచి బయటకు వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, సీఈవో, ప్రిన్సిపల్, పీఈటీతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.



టీచర్స్‌కాలనీలో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

ఇంటింటికి శ్రీరాములవారి అక్షింతలు

హయత్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి: అయోధ్య రామచంద్ర స్వామి అక్షింతలను శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటి, మన్సూరాబాద్, చంపాపేట, వనస్థలిపురం, ఓల్డ్‌మలక్‌పేట, మీర్‌పేట్ డివిజన్‌లలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ విస్తరణ వేగవంతం

- మరో ఏడు నెలల్లో అందుబాటులోకి ఎక్స్‌ప్రెస్‌వే..
- మొత్తం 12 లేన్లు ఎక్స్‌ప్రెస్ వేగా మధ్యలోని ఆరు లేన్లు
- మూడు చోట్ల ఫ్లైఓవర్లు.. పాదచారుల వంతెనలు

మన్సూరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణ పనులు వేగమందుకున్నాయి. చింతల్‌కుంట చెక్‌పోస్ట్ నుంచి ఆందోళ్‌మైసమ్మ దేవాలయం వరకు ఎన్‌హెచ్-65 విస్తరణ పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో వేగంగా పనులు కొనసాగుతున్నాయి. మొదటగా జీహెచ్‌ఎంసీ అవతలి ప్రాంతంలో ఆరేడు నెలల కిందటే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. సర్వీసు రోడ్లను నిర్మించిన అనంతరం వాహనాలను రూట్ మళ్లించి పనులు చేపట్టారు. ఈక్రమంలో ఆందోళ్ మైసమ్మ ప్రాంతం నుంచి పెద్ద అంబర్‌పేట వరకు విస్తరణ పనులు 40 శాతం మేర పూర్తయ్యాయి. అవసరమైన చోట ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు. ఇక జీహెచ్‌ఎంసీ పరిధిలో కూడా రోడ్డు విస్తరణలో వేగం పెంచారు. ఆటోనగర్ జింకల పార్కు నుంచి హయత్‌నగర్ వరకు పనులు ఇటీవల ప్రారంభించారు. అయితే పనుల కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. హయత్‌నగర్ ప్రాంతంలో సాధారణంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. దీంతో హయత్‌నగర్ తొర్రూర్ చౌరస్తా నుంచి భాగ్యలత వరకు వాహనదారులు కొంత ఇబ్బందులు పడుతున్నారు.



హయత్‌నగర్ భాగ్యలత వద్ద కొనసాగుతున్న ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణ పనులు

26 కిలో మీటర్ల వరకు నిర్మాణం

విజయవాడ జాతీయ రహదారిని ఎక్స్‌ప్రెస్ హైవేగా తీర్చిదిద్దేందుకు ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో చింతల్‌కుంట చెక్‌పోస్ట్ నుంచి ఆందోళ్ మైసమ్మ వరకు ఉన్న 26 కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. అయితే కొత్తగూడెం చౌరస్తా వరకు ఎక్స్‌ప్రెస్‌వేను అభివృద్ధి చేస్తున్నారు. సాధారణంగానే మిగతా రోడ్డు విస్తరణ చేపడుతున్నారు. చింతల్‌కుంట నుంచి అంబర్‌పేట ఓఆర్‌ఆర్ వరకు 12 లేన్ల రోడ్డు, ఆ తరువాత నుంచి 10 లేన్ల రోడ్డును విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో మధ్యలో ఉండే ఇటు మూడు, అటు మూడు లైన్లను ఎక్స్‌ప్రెస్‌వేగా తీర్చిదిద్దుతున్నారు. మిగతా లేన్లను ఎక్స్‌ప్రెస్ వేకు ఇరువైపులా సర్వీసు రోడ్డుగా వాహనదారులు వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చింతల్‌కుంటలో ఎక్స్‌ప్రెస్ వేలోకి ప్రవేశించే వారు ఆటోనగర్ వరకు నేరుగా వస్తారు. ఆటోనగర్‌లో ఎక్స్‌ప్రెస్‌లోకి ప్రవేశించే వాహనాలు ఇక నేరుగా.. పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు వద్దే దిగాల్సి ఉంటుంది. ఔటర్ దాటిన తరువాత మళ్లీ ఎక్స్‌ప్రెస్ వే మొదలై.. కొత్తగూడెం చౌరస్తా వద్ద ముగుస్తుంది. సర్వీసు రోడ్లలో వెళ్లేవారు యూటర్న్ చేసుకోవటానికి ప్రధాన కూడళ్లల్లో తొమ్మిది చోట్ల ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు. పనులు పూర్తయి ఎక్స్‌ప్రెస్ వే అందుబాటులోకి వస్తే వాహనదారులు ఇక ట్రాఫిక్ చిక్కులు లేకుండా రయ్యుమంటూ వెళ్లిపోవచ్చు.

మూడు చోట్ల ఫ్లైఓవర్లు

ఎక్స్‌ప్రెస్ వే నిర్మిస్తున్న నేపథ్యంలో సర్వీసు రోడ్లపై వెళ్లేవారు యూటర్న్‌లు చేసుకోవటానికి జీహెచ్‌ఎంసీ పరిధిలో మూడు చోట్ల ఫ్లైఓవర్లు అందుబాటులోకి వస్తున్నాయి. పనామా గోదాముల చౌరస్తా, తొర్రూర్ చౌరస్తా, హయత్‌నగర్ ప్రధాన కూడలిలో ఫ్లైఓవర్లు వస్తున్నాయి. వాస్తవానికి చింతల్‌కుంట నుంచి పెద్ద అంబర్‌పేట వరకు ఎక్కడా అడ్డంకి లేకుండా ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలని అధికారులు భావించారు. కానీ ఆటోనగర్ పారిశ్రామిక కేంద్రానికి భారీ గూడ్స్ వాహనాలు ఎక్కువగా వస్తుంటాయి. బిల్డింగ్ మెటీరియల్ లారీలు కూడా ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో ఫ్లైఓవర్ కింద యూ టర్న్ చేసుకోవటం కొంత ఇబ్బంది అవుతుందని పలువురి విజ్ఞప్తి మేరకు ఆటోనగర్‌లో ఎక్స్‌ప్రెస్ వేకు బ్రేక్ ఇచ్చారు. ఇక ఆటోనగర్ దాటిన తరువాత ఎక్స్‌ప్రెస్ వేలోకి ప్రవేశించే వాహనదారులు.. నేరుగా పెద్దఅంబర్‌పేట ఔటర్ వద్దే దిగాల్సి ఉంటుంది.

2024 జూలై వరకు అందుబాటులోకి..

ప్రస్తుతం విజయవాడ జాతీయ రహదారి పనులు వేగంగా నడుస్తున్నాయి. 2024 జూలై వరకు పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. జీహెచ్‌ఎంసీ పరిధిలో పనామా గోదాముల చౌరస్తా, సాయిబాబాగుడి చౌరస్తా, హయత్‌నగర్ చౌరస్తాలలో ఫ్లైఓవర్లు వస్తాయి. ఐదున్నర మీటర్ల ఎత్తులో ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నాం. సర్వీసు రోడ్డున వెళ్లే ఏ వాహనాలైనా వాటి కింద సులువుగా యూటర్న్‌లు చేసుకోవచ్చు. ఇక సాధారణ ప్రజలు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు లేకుండా అవసరమైన మూడు చోట్ల ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేస్తాం.

\- శరత్‌చంద్ర, ఏఈ, నేషనల్ హైవేస్ విభాగం

జర్నలిస్టుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రాంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, దీర్ఘకాలంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు కోరారని, ప్రధానంగా ఇళ్ల స్థలాల సమస్యను గత ప్రభుత్వం పరిష్కరించకుండా పదేళ్లుగా జాప్యం చేసిందని తెలిపారన్నారు. శనివారం జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు పులిపలుపుల ఆనందం, తన్నీరు శ్రీనివాస్, కార్యదర్శి ఇ.చంద్రశేఖర్, నాయకులు కె.పాండురంగారావు, జె.ఉదయభాస్కర్‌రెడ్డి, యర్రమిల్లి రామారావు తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు. జర్నలిస్టులకు గతంలో మూడు సార్లు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తుందన్న నమ్మకం ఉందని వారు మంత్రికి వివరించారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన విషయం వాస్తవమేనని, వారి సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మామిడి సోమయ్య తదితరులు

'తహసీల్దార్‌పై దివ్యాంగుడి ఫిర్యాదు'కు స్పందన

ఇంటి స్థలాన్ని పరిశీలించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హయత్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. శనివారం బాగ్ హయత్‌నగర్ ఆర్ఐ ప్రసాద్‌శర్మ వీరన్నగుట్టను సందర్శించారు. రాంబాబు క్రమబద్ధీకరణ కోసం పెట్టుకున్న స్థలంలో నిర్మించిన ఇంటిని పరిశీలించారు. అక్రమార్కుడికి అధికారులు సహకరిస్తున్నారని రాంబాబు శుక్రవారం హయత్‌నగర్ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. స్థానికులను విచారించి అధికారులు వివరాలను నమోదు చేసుకున్నారు. పూర్తి వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. కాలనీలో పెద్ద ఎత్తున్న ప్రభుత్వ భూముల్లో అక్రమాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తుంచారు. ఓ వర్గం అదే పనిగా ప్రభుత్వ స్థలాలను, పార్కు కోసం వదిలిన స్థలాలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తుంది.



ఇంటిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



మల్కాజిగిరి డీసీపీగా పీవీ పద్మజ, ఎల్బీనగర్ డీసీపీగా ప్రవీణ్‌కుమార్, మహేశ్వరం డీసీపీగా సునీతారెడ్డి, ట్రాఫిక్ డీసీపీగా మనోహర్, బాధ్యతలు తీసుకున్న అనంతరం సీపీ సుధీర్‌బాబును శనివారం కమిషనరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. - హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)



సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న జానకీ దరావత్

ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

- మలక్‌పేట నియోజకవర్గంలో 95,500 దరఖాస్తులు
- ప్రారంభమైన ఆన్‌లైన్ నమోదు

ఓల్డ్‌మలక్‌పేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన శనివారం సాయంత్రంతో ముగిసింది. మలక్‌పేట నియోజకవర్గం సర్కిల్ 6 పరిధిలో మొత్తం 95,500 దరఖాస్తులు వచ్చాయి. అభయహస్తం కింద 72,500 దరఖాస్తులు, ఇతర సమస్యలపై 23,000 వచ్చాయి. నియోజకవర్గంలో మొత్తం 28 కేంద్రాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాపాలనలో ప్రజల నుంచి పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. 6 రోజుల పాటు సంబంధిత అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిదులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాపాలన విజయవంతం చేశారు.



దరఖాస్తులను ఎంట్రి చేస్తున్న ఆపరేటర్

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంతో పాటు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో ప్రజా పాలన 8 రోజుల పాటు విజయవంతంగా కొనసాగింది. మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యాలయం, మున్సిపాలిటీలోని వార్డు కార్యాలయాల వద్ద కౌంటర్లను ఏర్పాటు చేసి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. మండలంలోని 18 గ్రామాల్లో దాదాపు 19550, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో దాదాపు 16 వేల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు స్పష్టం చేశారు.

ప్రారంభమైన ఆన్‌లైన్ ఎంట్రీ..

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీ శనివారం నుంచే మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయంలో ప్రారంభమైంది. ఒక్కో దరఖాస్తు క్షుణంగా పరిశీలించి ఎంట్రీ చేయటానికి సుమారు 15-20 నిమిషాలు పడుతుందని ఆపరేటర్లు చెబుతున్నారు. సర్కిల్ పరిధిలో సోమవారం నుంచి ఆన్‌లైన్ ఎంట్రి వేగవంతం చేస్తామని డిసి జయంత్ తెలిపారు.

'రోటరీ' ఆధ్వర్యంలో సిటీ టు హంపీ కార్ల ర్యాలీ

రాజేంద్రనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వర్‌రావు(సీఆర్) ఫౌండేషన్‌లో డయగ్నోసిస్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు నిధుల సేకరణ కోసం రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ ఆధ్వర్యంలో శనివారం కార్ ర్యాలీ నిర్వహించారు.రాజేంద్రనగర్ సర్కిల్‌లోని ఉప్పర్‌పల్లి సోలిటర్ ఇంటర్నేషనల్ హైస్కూల్ నుంచి కర్ణాటకలోని హంపీ వరకు 364 కిలోమీటర్లు ఈ ర్యాలీ సాగనుంది.

20 కార్లలో వంద మంది సభ్యులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో కార్ల వేగం 45 కిలోమీటర్లు మించకుండా ఉంటుంది. కార్లు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, వాట్సాప్ చాటింగ్ చేస్తు కార్లు నడపవద్దని, అతివేగంతో కార్లు నడపవద్దని, మద్యం సేవించి కార్లు నడపవద్దనే సందేశాలు ఇస్తూ ర్యాలీ సాగుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ అధ్యక్షుడు అనిల్ రాంచందానీ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మీర్ ముర్తుజా అలీ తదితరులు పాల్గొన్నారు.



కారుపై గిటార్ వాయిస్తూ నాట్యం చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

యువతి అదృశ్యం



నందిని

సైదాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్నేహితురాలి జన్మదిన వేడుకలకు వెళ్లి ఓ యువతి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాదన్నపేట సాయిలాల్‌తోటలో నివాసముండే డి.నందిని(21) గత నెల 22న స్నేహితురాలి జన్మదిన వేడుకలకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాకపోవడంతో ఆమె అచూకీ కోసం వెతికారు. ఫలితం లేకపోవడంతో తండ్రి నవీన్‌కుమార్ మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో గొడవ పడి..



మోహెబుల్లా ఖాన్

ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు కనిపించకుండాపోవడంతో కుటుంబ సభ్యులు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుర్మగూడలో నివాసముండే మోహెబుల్లా ఖాన్(62) సెక్యూరిటి గార్డ్‌గా పనిచేసేవాడు. గత నెల 20న కుటుంబ సభ్యులతో గొడవపడి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాచకుడి మృతి

సైదాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో గుర్తు తెలియని యాచకుడు మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రమేష్ (50-60 సంవత్సరాల మధ్య వయస్సు) అనే యాచకుడు గత పదేళ్లుగా యాఖత్‌పురా రైల్వేస్టేషన్, మాదన్నపేట పరిసరాలలో అడుక్కుంటూ ఫుట్‌పాత్‌లలో జీవనం సాగించేవాడు. శుక్రవారం రాత్రి చావునీలోని పాడుబడిన ఇంట్లో నిద్రించాడు. కేసు నమోదు చేసుకున్న మాదన్నపేట పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొత్తపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో శనివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ దయాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఫలక్‌నుమా రోషన్ కాలనీలో ఉండే మహ్మద్ యూసుఫ్ అలియాస్ జైన్ (18) శుక్రవారం రాత్రి 10.30 గంటలకు అతని స్నేహితులతో కలిసి సికింద్రాబాద్‌లో ఓ ఫంక్షన్‌కు వెళుతున్నామని ఇంటి నుంచి బయలుదేరాడు. శనివారం ఉదయం 5.40 గంటలకు వారు బైకుపై ఎల్బీనగర్ నుంచి సాగర్ రింగ్ రోడ్డు ఫ్లై ఓవర్‌పై టీకేఆర్ కమాన్‌వైపు వేగంగా వెళుతున్నారు. బైకు అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలపాలై యూసుఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభ్యమైన సెల్‌ఫోన్ ద్వారా పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి ఆటోడ్రైవర్ మారుఫ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభ చాటుకునేందుకు ఎక్స్‌పోలు దోహదపడుతాయి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగర శివారు దేశ్‌ముఖ్‌లోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో "ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో-2024"ను శనివారం ఘనంగా నిర్వహించారు. సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్‌సైన్స్, ఐటీ, ఐఈఎమ్‌ఎల్, డేటాసైన్స్, మెకానికల్, ఏఈడీఎస్ విభాగలకు చెందిన విద్యార్థులు సైబర్ భద్రత, సౌరశక్తి, బ్యాటరీ టెక్నాలజీ, ఆటోమేషన్, ఈఓటీలాంటి 488 ప్రాజెక్టులను రూపొందిందించి ఎక్స్‌పోలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా విజ్ఞన్ సంస్థల సీఈవో బోయపాటి శ్రావణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి ఎక్స్‌పోలు దోహదపడుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దుర్గాసుకుమార్ మాట్లాడుతూ. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఎక్స్‌పో మంచి వేదికలాంటిదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు.